# నీటి ఒత్తిడి గుప్పిట్లో 50 శాతం ప్రపంచ జనాభా..!

నీరే ప్రాణాధారం. భూగోళంపై 70 శాతం వరకు జలావరణమే ఉన్నది. భూగ్రహంపై ఉన్న నీటిలో 2-3 శాతం వరకు మాత్రమే మానవ వినియోగయోగ్యతను కలిగి ఉన్నది. ధరణిపై జల చక్రం దెబ్బతింటున్నది. నీటి కొరత విశ్వ మానవాళిని భయపెడుతున్నది. ప్రపంచ మానవాళి అతివృష్టి, అనావృష్టి విపత్తులతో సతమతమవుతున్నది. ప్రపంచవ్యాప్తంగా మానవాళి తీవ్రమైన వాతావరణ ప్రతికూల మార్పుల దెబ్బకు విలవిల్లాడుతున్నారు. ఓ వైపు అకాల వర్ష వడగళ్లు, తీవ్రమైన వరదలు, మరో వైపు తీవ్ర వడగాలులు, కరువుకాటకాలు చుట్టు ముడుతున్నాయి. వరల్డ్ రిసోర్సెస్ ఇనిస్టిట్యూట్ (డబ్ల్యూఆర్ఐ) రూపొందించిన "ఆక్వాడక్ట్ వాటర్ రిస్క్ అట్లాస్" గణాంకాల ప్రకారం ప్రపంచంలో 25 శాతం జనాభా కలిగిన 25 దేశాల్లో అతి తీవ్రమైన నీటి ఒత్తిడి (ఎక్స్‌ట్రీమ్లీ హై వాటర్ స్ట్రెస్) రానుందని అంచనా వేసింది. రానున్న రోజుల్లో 50 శాతం ప్రపంచ జనాభా, దాదాపు 4 బిలియన్లు, ప్రతి ఏట కనీసం ఒక మాసమైన అత్యధిక నీటి కొరతను అనుభవిస్తున్నట్లు వర్ణింపబడింది. తీవ్ర నీటి ఒత్తిడి సంక్షోభంతో సాధారణ జీవితాలు, ఉద్యోగ ఉపాధులు, ఆహార లభ్యత (వ్యవసాయ ఉత్పత్తులు), శక్తి భద్రత లాంటి ప్రతికూలతలు ఎదురు కానున్నట్లు హెచ్చరికలు చేస్తున్నారు. పంటలు, జంతు జాతి పరిరక్షణలు, విద్యుదుత్పత్తి, మానవాళి ఆరోగ్య రక్షణ, సమానత్వ సమాజ స్థాపన, పర్యావరణ సమతుల్యత లాంటివి నీటి లభ్యత మీద మాత్రమే ఆధారపడి ఉంటాయని మనకు తెలుసు. నీటి ఒత్తిడిని తగ్గించడానికి అందుబాటులో ఉన్న నీటిని ప్రణాళికయుక్తంగా నియంత్రించడం, వాడుకోవడం, భద్రపరుచుకోవడం, పొదుపుగా వాడుకోవడం, వృధాను అరికట్టడం లాంటివి అనివార్యంగా చేయాలి. నీటి లభ్యతతో ఆర్థిక ప్రగతి, వాతావరణ సానుకూల మార్పులు, జీవరాసుల ఆరోగ్య భాగ్యాలు వర్ధిల్లుతాయి.

భూమండలంపై అందుబాటులో ఉన్న నీటి కన్న విచక్షణారహిత వినియోగం పెరుగుతున్నది. 1960లో నీటి వినియోగంతో పోల్చితే నేడు రెట్టింపు నీటి వినియోగం పెరగడం గమనించారు. జనాభా విస్ఫోటనం, వ్యవసాయ రంగంలో ఆధునికీకరణ, పశు పోషణ, శక్తి ఉత్పత్తి, మ్యాన్యుఫాక్చరింగ్ రంగాల అభివృద్ధితో నీటి వాడకం విపరీతంగా పెరుగుతున్నది. నీటి నిల్వల మౌలిక వసతులకు పెట్టుబడులు తగ్గడం, సుస్థిరాభివృద్ధి కొరవడిన అస్పష్ట పాలసీల అమలు, వాతావరణంలో వస్తున్న ప్రతికూల మార్పులు లాంటి అంశాలు నీటి ఎద్దడిని విపరీతంగా ప్రభావితం చేస్తున్నాయి. నీటి లభ్యతకు, నీటి వినియోగానికి మధ్య సమతుల్యత దెబ్బ తింటున్నది. లభ్యమైన నీటిలో 80 శాతం వాడితే 'అతి తీవ్ర నీటి ఒత్తిడి (ఎక్స్‌ట్రీమ్ వాటర్ స్ట్రెస్) అని, 40 శాతం వరకు వినియోగిస్తే 'అధిక నీటి ఒత్తిడి (హై వాటర్ స్ట్రెస్) అని నిర్ణయిస్తారు.

**అత్యధిక నీటి ఒత్తిడి సంక్షోభ దేశాలు:**

ప్రపంచవ్యాప్తంగా 25 దేశాల్లో అందుబాటులో ఉన్న నీటిలో వినియోగం 80 శాతం కన్న అధికంగా ఉన్నట్లు గమనించారు. అత్యధిక నీటి ఒత్తిడి కలిగిన దేశాల జాబితాలో యూకె, ఇండియా, ఇరాన్, మెక్సికో, సౌధీ అరేబియా, చిలీ, శాన్‌మెరినో, బెల్జియం, గ్రీస్ దక్షిణ ఆఫ్రికాలు ముందున్నాయి. వీటికి తోడుగా అల్పాదాయ లేదా మధ్యాదాయ దేశాలైన బెహరెయిన్, సైప్రస్, కువైట్, లెబనాన్, ఓమన్, ఖతార్ లాంటి దేశాల్లో గృహ అవసరాలు, వ్యవసాయం, పరిశ్రమల వాడకానికి నీరు అధికంగా అవసరం కావడంతో కూడా ఆయా దేశాలు తీవ్ర నీటి కొరత అంచున విలవిల్లాడుతున్నాయి. మిడిల్ ఈస్ట్, నార్థ్ ఆఫ్రికా దేశాల్లో 83 శాతం జనాభా, దక్షిణ ఆసియా దేశాల్లో 74 శాతం జనాభా నీటి కొరత సమస్యతో బాధ పడుతున్నారు. 2050 నాటికి నీటి డిమాండ్ 25 శాతం వరకు పెరగవచ్చని, దీనితో అదనంగా ఒక బిలియన్ జనాభా నీటి ఒత్తిడి వలలో పడనుందని అంచనా వేస్తున్నారు. ఈ ప్రాంత దేశాల్లో రానున్న ఏండ్లలో 100 శాతం జనాభా నీటి తీవ్ర కొరత కోరల్లో చిక్కనున్నారనే కఠిన వాస్తవం భయాన్ని కలిగిస్తున్నది. నీటి కొరత హద్దులు దాటితే ఆయా దేశాల్లో సామాజిక, రాజకీయ అశాంతి ప్రజా జ్వాలలు ఎగిసి పడతాయని కూడా గత ఇరాన్ చరిత్ర హెచ్చరిస్తున్నది. ఆఫ్రికన్ దేశాల్లో నీటి విచక్షణారహిత వాడకం, నీటి నియంత్రణలో లోపాల వల్ల తీవ్రాతితీవ్రమైన నీటి ఒత్తిడి కబలించనుందని హెచ్చరిస్తున్నారు.

**నీటి ఒత్తిడి దుష్ప్రభావం:**

తీవ్ర నీటి ఒత్తిడి కలిగిన దేశాల్లో ఆహార భద్రత కొరవడుతుంది. 2010లో నీటి ఒత్తిడి వల్ల జిడిపీలో 24 శాతం, దాదాపు 15 ట్రిలియన్ డాలర్ల నష్టం జరిగిందని, 2050 నాటికి జిడిపీలో 31 శాతం, దాదాపు 70 ట్రిలియన్ డాలర్ల నష్టం నీటి ఒత్తిడి వల్ల జరగవచ్చని అంచనా వేశారు. నీటి ఒత్తిడి ఫలితంగా భారత్ లాంటి దేశాల్లో విద్యుత్ కొరత, వ్యవసాయ దిగుబడుల తగ్గుదల, పారిశ్రామిక మందగమనం లాంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. నీటి కొరత కారణంగా 2017-21ల మధ్య 8.2 టెరావాట్-హవర్ శక్తి ఉత్పత్తి తగ్గిందని, ఈ శక్తి 1.5 మిలియన్ల భారత కుటుంబాలకు 5 ఏండ్ల పాటు విద్యుత్ సరఫరా చేయవచ్చని తెలుపుతున్నారు. తీవ్ర నీటి ఒత్తిడి మూలంగా చెరుకు, గోధుమలు, రైస్, మొక్కజొన్నలు లాంటి పంటలకు తీవ్ర నష్టం కలుగుతున్నది. నీటి ఒత్తిడితో పాటు కరువులు, అకాల వరదల కారణాలతో 2010తో పోల్చితే 2050 నాటికి 56 శాతం ఆహార ధాన్యాలు అధికంగా అవసరమవుతాయి.

**నీటి సంరక్షణ మార్గాలు:**

నీటి సమర్థవంతమైన నిర్వహణతో నీటి కొరత కొంత వరకు తీరుతుందని ప్రపంచ దేశాలు గుర్తించాలి. నీటి నిర్వహణ పాలసీలు, వ్యవసాయరంగానికి పరిమితిలో నీటి వాడకం, నీటి వనరుల సమీకరణ, నీటి నిల్వలను పెంచడం, హరిత మౌళిక వనరుల కల్పన, చిత్తడి నేలల పునర్ స్థాపన, అడవుల పరిరక్షణ, పునరుత్పాదక శక్తి ఉత్పత్తులు/వినియోగాలను పెంచడం, జీవ వైవిధ్య పరిరక్షణలకు పెట్టుబడులు, నీటి వృధాను అరికట్టడం, ఇంకుడు గుంటలు/చెక్‌డ్యామ్‌ల నిర్మాణాలు, పట్టణాల్లో సమర్థవంతమైన నీటి నిర్వహణ వ్యవస్థల ఏర్పాటు, మురుగు నీటి శుద్ధితో తిరిగి వాడుకోవడం, తక్కువ నీటితో పండే పంటలను ప్రోత్సహించడం, డ్రిప్/స్ప్రింక్లర్స్ వాడకం, నీటి ఒత్తిడి దుష్ప్రభావాలను అవగాహన పరచడం లాంటి చర్యలు నీటి ఒత్తిడిని తగ్గిస్తాయి.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# సెప్టెంబర్ 10న సూర్యాపేటలో బీసీ జన గర్జన బహిరంగ సభ

## -బీసీ సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షులు బొల్క వెంకట్ యాదవ్

సూర్యాపేట ఆగష్టు 26 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );బిసి ల ఆత్మా గౌరవం, బిసి ల హక్కుల పరిరక్షణ కోసం సెప్టెంబర్ 10వ తేదిన సూర్యాపేట లో బీసీ జన గర్జన బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సమితి రాష్ట్ర ఆధ్యక్షులు బొల్క వెంకట్ యాదవ్ తెలిపారు

శనివారం సూర్యాపేట లో మీడియా సమావేశం లో మాట్లాడు తూ సూర్యాపేట పట్టణం లో గవర్న మెంట్ జూనియర్ కాలేజ్ ఆవరణ లోజరిగే బీసీ జన గర్జన బహిరంగ సభను సూర్యపేట నియోజకవర్గ ప్రజలు అన్ని రాజకీయ పార్టీ లా, బీసీ మహిళలు, బీసీ జెడ్పీటీసీలు, బీసీ ఎంపీపీలు, బీసీ కౌన్సిలర్లు, బీసీ సర్పంచులు ,బీసీ ఎంపీటీసీలు బీసీ వార్డు మెంబర్లు, బీసీ ఉద్యోగులు, బీసీ విద్యార్థి సంఘం నాయకులు, బీసీ మేధావులు, బీసీ యువజన నాయ కులు, ఎంబీసీ నాయకులు , బీసీ జర్నలిస్టులు,బీసీ కార్మికులు కర్షకులు, హాజ రావుతున్నట్లు తున్నట్లు తెలి పారు.రాబోయే శాసనసభ పార్లమెంట్ ఎన్నికలలో అన్ని రాజకీయ పార్టీలు వారి వారి మేనిఫెస్టోలను ప్రకటించా లని జనాబా ప్రాతిపదికన బిసి లకు 62 శాతం అసంబ్లి సీట్లు కేటాయించా లని డిమాండ్ చేసారు. పార్లమెంట్ లో బిసి బిల్లు పెట్టాలని, బిసిలకు రాజ్యదికారం లో సమాన వాటా కల్పించాలనిడిమాండ్ చేసారు. అందుకు బీసీ కుల గణన చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. 75 ఏళ్ళుగా భారతదేశంలో అన్ని పదవులు, సంక్షేమ పథకాలు తమరే అనుభవించారని.. బీసీలకు మాత్రం ఏం దక్కడం లేదని విమర్శించారు. అలాగే బిసి ఉద్యోగులలో రిజర్వేషన్ కల్పించాలని, పార్లమెంట్ లో బీసీలకు రాజకీయ రిజర్వేషన్ పెట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. బీసీ సంఘాలన్నీ కలిసికట్టుగా ఉ ద్యమించాలని పిలుపునిచ్చారు. అన్ని రాష్ట్రాల్లో పర్యటించి బీసీలను ఏకం చేస్తామన్నారు. రాజకీయ పార్టీలన్నీ తమ పద్ధతిని మార్చుకోవాలని హితవుపలికారు. పేద కులాల అభివృద్ధి కోసం అందరూ ముందుకు రావాలన్నారు. రానున్న అసంబ్లి ఎన్నికలకు సంబంధించి కెసిఆర్ ప్రభుత్వం బిసి లకు తక్కువ సీట్లు ఇచ్చి బిసిలను అనుగ ద్రొక్కే చర్యలకు పాల్పడిందని బొల్క వెంకట్ యాదవ్ విమర్శించారు ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు, సతీష్ నాయి బ్రాహ్మణ, కిషోర్ గౌడ్, సందీప్ నాయుడు, కరుణాకర్ ముదిరాజ్, ప్రశాంత్ రజాక్, నవీన్ కుమ్మరి, అంజి యాదవ్, వివిధ అన్ని కులాల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# భారత-గ్రీస్ ప్రధాన మంత్రుల సమావేశం

న్యూఢిల్లీ, ఆగష్టు 26:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఏథెన్స్'లో 2023 ఆగస్టు 25న గ్రీస్ ప్రధాని గౌరవనీయ 'కిరియాకోస్ మిత్సోతాకిస్'తో సమావేశమయ్యారు. దేశాధినేతలిద్దరూ ముఖాముఖి స్థాయితోపాటు ప్రతినిధుల స్థాయి సమావేశాల్లో చర్చలు నిర్వహించారు. గ్రీస్ దేశంలో కార్చిచ్చు చెలరేగి అపార ప్రాణ-ఆస్తి నష్టం సంభవించడంపై ప్రధాని మోదీ ఈ సందర్భంగా సంతాపం ప్రకటించారు. కాగా, ఇటీవల 'చంద్రయాన్' విజయాన్ని గ్రీస్ ప్రధాని మిత్సోతాకిస్ మానవాళికే విజయంగా అభివర్ణిస్తూ ప్రధాని మోదీకి అభినందనలు తెలిపారు.

ఇద్దరు దేశాధినేతల మధ్య వాణిజ్యం-పెట్టుబడులు, రక్షణ-భద్రత, సాంకేతికత, మౌలిక సదుపాయాలు, డిజిటల్ చెల్లింపులు, షిప్పింగ్, ఫార్మా, వ్యవసాయం, వలసలు-చలనశీలత, పర్యాటకం, నైపుణ్యాభివృద్ధి, సంస్కృతి, విద్య, ప్రజల మధ్య సంబంధాలుసహా ద్వైపాక్షిక భాగస్వామ్యంలోని వివిధ కోణాలు స్పృశిస్తూ చర్చలు సాగాయి. ఐరోపా సమాఖ్య, ఇండో-పసిఫిక్, మధ్యధరా ప్రాంతాల అంశాలుసహా వివిధ బహుపాక్షిక అంశాలపైనా వారిద్దరూ చర్చించారు. అంతర్జాతీయ చట్టాలు, సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతలను ప్రపంచ దేశాలన్నీ గౌరవించాల్సిన అవసరాన్ని వారిద్దరూ నొక్కిచెప్పారు.

# 27న చాత్తాద శ్రీవైష్ణవ భవననిర్మాణ భూమి పూజ కార్యక్రమానికి తరలి రండి



హైదరాబాద్ ఆగష్టు 26 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); ఈనెల 27 ఆదివారం రోజున మేడ్చల్ జిల్లా పీర్జాదీ గూడ లో ప్రభుత్వం కేటాయించిన స్థలములో చాత్తాద శ్రీవైష్ణవ భవన భూమి పూజ శంకుస్థాపన మహోత్సవ కార్యక్రమానికి చాత్తాద శ్రీవైష్ణవ బంధువులందరు వేల సంఖ్యలో తరలి వచ్చి మన ఐఖ్యతను ,మన బలం బలగం ప్రభుత్వానికి చాటాలని తెలంగాణా చాత్తాద శ్రీవైష్ణవ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అశ్వాపురం వేణుమాధవ్, ఉపాధ్యక్షులు టి.కేశవ కుమార్ లు పిలుపునిచ్చారు. ప్రముఖులతో వైభవంగా భవన నిర్మాణ భూమి పూజ జరుగునని తెలిపారు. ఈ భూమి పూజ శంకుస్థాపన మహోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి శంకుస్థాపన చేస్తారని వారు తెలిపారు అలాగే ఈ కార్యక్రమానికి రాష్ట్ర శాసనసభ ఉ పసభాపతి టి పద్మారావు గౌడ్, కార్మిక శాఖ మంత్రి సిహెచ్ మల్లారెడ్డి, పశు సంవర్ధక శాఖా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, క్రీడల శాఖ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్, బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణ మోహన్ రావు తదితరులు హాజరవుతున్నట్లు తెలిపారు.

# టెర్మినల్ భవనాల నిర్మాణ ఆకృతులపై ఏఏఐ రూపొందించిన పుస్తకాన్ని

## ఆవిష్కరించిన కేంద్ర పౌర విమానయాన,ఉక్కు శాఖ మంత్రి

న్యూఢిల్లీ, ఆగష్టు 26:టెర్మినల్ భవనాల నిర్మాణ ఆకృతులపై ఏఏఐ రూపొందించిన కాఫీ టేబుల్ పుస్తకాన్ని ఈ రోజు కేంద్ర పౌర విమానయాన ,ఉక్కుశాఖ మంత్రి శ్రీ జ్యోతిరాదిత్య ఎం సింధియా ఈరోజు న్యూఢిల్లీలో ఆవిష్కరించారు. విమానాశ్రయాల టెర్మినల్ భవనాల నిర్మాణంలో ఉ పయోగించిన సాంప్రదాయ, స్థానిక ఆకృతులను పుస్తకంలో పొందుపరి చారు. . 19 విమానాశ్రయాల టెర్మినల్ భవనాల చిత్రాలతో పుస్తకాన్ని రూపొందించారు. సాంప్రదాయ, స్థానిక నిర్మాణఆకృతులకు ప్రాధాన్యత ఇస్తూ భవిష్యత్తులో వివిధ విమానాశ్రయాలలో టెర్మినల్ భవనాల నిర్మాణం చేపట్టేందుకు సాగుతున్న ప్రయత్నాలకు అనుగుణంగా పుస్తకాన్ని రూపొందించారు.

దేశ వారసత్వాన్ని ప్రతిబింబించే విధంగా స్థానిక భారతీయ సాంప్రదాయ, స్థానిక కళకు ప్రాధాన్యత ఇస్తూ ఇకపై టెర్మినల్ భవనాల నిర్మాణం జరుగుతుంది.

విమానాల రాకపోకల్లో టెర్మినల్ భవనాల పాత్ర కీలకంగా ఉంటుంది. విమాన ప్రయాణం సాఫీగా, ఇబ్బందులు లేకుండా జరిగేందుకు సహకరించే వివిధ సేవలు టెర్మినల్ భవనంలో అందిస్తారు. ఒక నగరానికి విమానంలో వచ్చే వారికి టెర్మినల్ భవనం మొదటి అనుభూతి అందిస్తుంది. నగరంపై ప్రయాణీకులకు ఒక అవగాహన కల్పిస్తుంది. టెర్మినల్ భవనాలు ఇకపై సేవలు, సౌలభ్యం అందించే భవనాలుగా మాత్రమే కాకుండా ప్రయాణీకులకు విస్మయం, అద్భుత అనుభూతిని కలిగించే అద్భుతాలుగా నగరానికి మైలురాయిగా ఉండే విధంగా నిర్మించాలని పౌర విమానయాన మంత్రిత్వ శాఖ నిర్ణయించింది.

భారతదేశ సామాజిక, సాంస్కృతిక వైవిధ్యం,వారసత్వాన్నిప్రపంచానికి చాటి చెప్పాలని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నిర్ణయించారు. దీనికోసం స్వయంగా కృషి చేస్తున్న ప్రధానమంత్రి వివిధ మంత్రిత్వ శాఖలకు మార్గదర్శకాలు జారీచేశారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నుంచి స్ఫూర్తి పొందిన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి శ్రీ జ్యోతిరాదిత్య ఎం సింధియా చర్యలు ప్రారంభించారు. ప్రయాణికులకు, చూసే వారికి భారతదేశ వారసత్వం సారాంశాన్ని తెలియజేసే విధంగా ఇప్పటికే పనిచేస్తున్న, భవిష్యత్తులో నిర్మించే టెర్మినల్ భవనాలలో భారతీయ వాస్తుశిల్పం నైపుణ్యాన్ని క్రియాత్మక సౌలభ్యంతో రంగరించాలని శ్రీ జ్యోతిరాదిత్య ఎం సింధియా నిర్ణయించారు. వారసత్వ విలువలు, స్థానిక కళతో రూపుదిద్దుకునే టెర్మినల్ భవనాలు కేవలం భవనాలుగా మాత్రమే మదిలో కలకాలం గుర్తుండి పోయే విధంగా రూపుదిద్దుకుంటాయి.

శ్రీ జ్యోతిరాదిత్య సూచనల మేరకు టెర్మినల్ భవనాలను సంబంధిత నగరం రూపురేఖలు అనుగుణంగా నిర్మించడానికి ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కృషి ప్రారంభించింది. టెర్మినల్ భవనాలు కేవలం భౌతిక అంశాలుగా కాకుండా భారతదేశ సంస్కృతి, సంప్రదాయం, కళ ను ప్రబింబించే కట్టడాలు గా నిలుస్తాయి. టెర్మినల్ భవనాలు స్థానిక ప్రజల గౌరవ మర్యాదలు, జాతీయ స్ఫూర్తికి ప్రతీకగా ఉంటాయి.

పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పౌర విమానయాన మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ రాజీవ్ బన్సాల్, పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఓఎస్డీ శ్రీ చంచల్ కుమార్, బీసీఏఎస్ డీజీ శ్రీ జుల్ఫికర్ హసన్, డీజీసీఏ శ్రీ విక్రమ్ దేవ్ దత్, ఏఏఐ చైర్మన్ శ్రీ సంజీవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# లారీ, ఆర్టీసీ బస్సు ఢీ- 24మందికి గాయాలు



అమరావతి, ఆగష్టు 26: కొయ్యలగూడెం మండలంలోని జంగారెడ్డిగూడెం వెళ్ళే ఎన్.హెచ్ 516-డీ జాతీయ రహదారి పులివాగు వంతెనపై ఇవాళ తెల్లవారుజామున లారీ, ఆర్టీసీ బస్సు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ప్రమాద విషయాన్ని తెలుసుకున్న తహశీల్దార్ నాగమణి వెను వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ ప్రమాదంలో 24 మందికి గాయాలయ్యాయని తహశీల్దార్ నాగమణి తెలిపారు. ఈమేరకు ఆమె తెలిపిన వివరాల ప్రకారం జంగారెడ్డిగూడెం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వాడపల్లి వెళ్తుండగా జంగారెడ్డిగూడెం వైపు వెళ్తున్న లారీ ఎదురెదురుగా ఢీ కొట్టుకున్నాయి.

ప్రమాదంలో గాయపడ్డ ప్రయాణీకులను రెండు 108 వాహనాల్లో కొయ్యలగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అక్కడి వైద్యులు, సిబ్బంది తక్షణమే ప్రాథమిక వైద్యం అందించారని అన్నారు. 14 మంది ప్రథమ చికిత్స అనంతరం ఇంటికి వెళ్లిపోయారని తెలిపారు. గాయపడ్డ వారిలో ఒక హృద్రోగ వ్యక్తి, ఒక బాలింత ఉండగా వారిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి మెరుగైన వైద్యం కోసం పంపినట్లు తెలిపారు. అదేవిధంగా మూడు నెలల చిన్నారిని వారి కుటుంబ సభ్యులు రాజమండ్రిలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు ఆమె తెలిపారు. మిగిలిన 7 మందికి జంగారెడ్డిగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి ప్రాణాపాయం లేదని తహశీల్దార్ వెల్లడించారు. కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం ఆసుపత్రుల్లో వైద్య సేవలను తహశీల్దార్ తన సిబ్బందితో దగ్గరుండి పర్యవేక్షించారు.

# తిరుమల కాలిబాటలో అయిదు చిరుతల కదలికలు - అప్రమత్తమైన అధికారులు

తిరుపతి, ఆగష్టు 26:: తిరుమల కాలిబాటల సమీపాన మళ్లిట చిరుతల సంచారం ఎక్కువైంది. నామాల గవి, నరసింహస్వామి ఆలయం పరిసరాల్లో మళ్లీ ఐదు చిరుతల కదలికలు గుర్తించారు. ఇప్పటికే అటవీ శాఖ అధికారులు బోన్లు పెట్టి మూడు చిరుతలను బంధించిన విషయం తెలిసిందే. తిరుమలలో ఆపరేషన్ చిరుత కొనసాగుతున్న నేపథ్యంలో ట్రాప్ కెమెరాల ఆధారంగా ఇంకా ఐదు చిరుతలు ఉన్నట్లు- అధికారులు గుర్తించారు. అవి ఎక్కడెక్కడ తిరుగుతున్నాయి..వాటిని ఎలా బంధించాలి అనే దానిపై అటవీ శాఖ వ్యూహం సిద్ధం చేస్తోంది. త్వరలో వాటిని బంధించి జూకు తరలిస్తామని డిఎఫ్ఓ సతీష్‌రెడ్డి చెపుతున్నారు. గతంలో అప్పుడప్పుడు తిరుమల కాలినడక బాట, అడవికి సమీపాన ఉండే గెస్ట్‌హౌస్‌ల వద్ద మాత్రమే కనపించిన వన్యమృగాలు.. ఇటీవల జనసంచారం ఉన్న ప్రాంతాల్లోనే ధైర్యంగా హల్‌చల్ చేస్తున్నాయి. నడకదారి భక్తబృందంలోని ఓ బాలుడిపైన చిరుత దాడి చేసి గాయపరచడం, ఇటీవల బాలిక లక్షితను ఓ పొట్టన పెట్టుకోవడడం వంటి సంఘటనలతో అలిపిరి, శ్రీవారి మెట్టు మార్గంలో శ్రీవారిని దర్శించుకోవడానికి వెళ్లే భక్తుల్లో భయాందోళనలు నెలకొన్నా యి. నిత్యం భక్తులతో సందడిగా ఉండే ఈ కాలినడక మార్గాలు ఇప్పుడు భక్తులు లేక వెలవెలబోతున్నాయి.దీంతో టీ-టీ-డీ, అటవీ శాఖ వన్యమృగాల రాకను అడ్డుకోవ డనికి.. భక్తులలో నెలకొన్న భయాందోళ నలు తొలగించడానికి అనేక చర్యలు చేపట్టాయి. తిరుమలలో సాగుతున్న ఆపరేషన్ చిరుతలో భాగంగా కాలినడక మార్గాల్లో 320కి పైగా ట్రాప్ కెమెరాలు, 36 బోన్లు ఏర్పాటు చేశారు. ఓ చిరుత బోను దగ్గరికి వచ్చి వెంటనే పక్క నుంచి వెళ్లిపోయిందని డిఎఫ్ఓ చెప్పారు. మరో ఎలుగుబంటి కూడా ఆ ప్రాంతంలోనే సంచరిస్తున్నట్టు- గుర్తించారు. వీటిని బంధించడానికి వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు.

# ఎమ్మెల్యే రమేష్ బాబుకు శుభాకాంక్షలు తెలిపిన పట్టణ మైనార్టీ విభాగం ప్రధాన కార్యదర్శి రాహేల్



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 26:(నేటినిజం ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ రంగ వ్యవహారాల సలహాదారుగా నియామకమైన ఎమ్మెల్యే రమేష్ బాబుకు వేములవాడ పట్టణ మైనార్టీ విభాగం ప్రధాన కార్యదర్శి ఎం.ఏ రా హే ల్ శుభాకాంక్షలు తెలిపారు.శనివారం హైదరాబాదులోని ఎమ్మెల్యే నివాసంలో ఆయన మర్యాదగాపూర్వకంగా కలిశారు.ఎమ్మెల్యే రమేష్ బాబుకు శా లువతో సన్మానించి.పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

# బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి : అశ్వాపురం వేణుమాధవ్

హైదరాబాద్, ఆగష్టు 26:బడుగు, బలహీన వర్గాల సాధికారతకు తెలంగాణ ప్రభుత్వం ఎంతో చేయూతనిస్తుందని చాత్తాద శ్రీవైష్ణవ సంఘం అధ్యక్షుడు అశ్వాపురం వేణుమాధవ్ అన్నారు. పీర్జాదిగూడలో ప్రభుత్వం కేటాయించిన స్థలంలో శ్రీవైష్ణవ సంఘం ఆత్మగౌరవ భవన్ నిర్మాణ పనులు చేపడుతున్నామన్నారు. ఈ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సకల జనులు ఒక్కేటనని వెయ్యేళ్ల కిందట భగవద్రామానుజుడు చాటి చెప్పిన స్ఫూర్తికి ఆత్మగౌరవ భవనాలు నిదర్శనమన్నారు.

సామాజిక సేవలో ముందున్న చాత్తాద శ్రీవైష్ణవులకు రాజకీయంగా అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్నికి విజ్ఞప్తి చేశారు. 27న పీర్జాదిగూడలో జరిగే చాత్తాద శ్రీవైష్ణ సంఘం ఆత్మగౌరవ భవన్ భూమిపూజకు భారీ సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా చాత్తాద శ్రీ వైష్ణవ సంఘం అధ్యక్షుడు తోమాల కొండస్వామి, తదితరులు పాల్గొన్నారు.



# జీ20 వాణిజ్యం & పెట్టుబడుల సమావేశం నిర్ణయాల పత్రం, సారాంశం ఆమోదంతో ముగిసిన మంత్రివర్గ సమావేశం

న్యూఢిల్లీ, ఆగష్టు 26:పింక్ నగరం జైపూర్‌లో, 'జీ20 వాణిజ్యం ఒ పెట్టుబడుల మంత్రివర్గ సమావేశం' (టీఐఎంఎం) ఈ రోజు ముగిసింది. కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. నిర్ణయాల పత్రం, అధ్యక్షదేశ సారాంశం తీసుకురావడంలో, ఆమోదం పొందడంలో జరిగిన చర్చల్లో పాల్గొన్న జీ20 సభ్య దేశాలు, ఆహ్వానిత దేశాల మంత్రులు, అంతర్జాతీయ సంస్థలైన ప్రపంచ వాణిజ్య సంస్థ, యూఎన్‌సీటీఏడీ, ఇంటర్నేషనల్ ట్రేడ్ సెంటర్, ఓఈసీడీ వంటి సంస్థల ప్రతినిధుల నిబద్ధత, సహకారానికి కేంద్ర మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

అంతర్జాతీయ వాణిజ్యం, పెట్టుబడులపై విశ్వాసాన్ని పునర్నిర్మించడం జీ20 సభ్య దేశాలుగా మన బాధ్యత అని గౌరవనీయ భారత ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ చెప్పారు. జీ20 మంత్రులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. భవిష్యత్ సవాళ్లను తట్టుకోగల, ప్రపంచ వాణిజ్యంలో ఎంఎస్ఎంఈల నుంచి ఎక్కువ భాగస్వామ్యాన్ని సృష్టించగల స్థితిస్థాపక, సమగ్ర ప్రపంచ విలువ గొలుసులను నిర్మించాల్సిన అవసరం ఉందని అన్నారు. డబ్ల్యూటీవో ప్రధానాంశంగా నియమాల ఆధారిత, బహిరంగ, భాగస్వామ్య, బహుపాక్షిక వాణిజ్య వ్యవస్థపై భారతదేశానికి ఉన్న దృఢ విశ్వాసం గురించి కూడా ప్రధాని మాట్లాడారు.

భారతదేశ అధ్యక్షతన, జైపూర్‌లో జరిగిన వాణిజ్య మంత్రివర్గ సమావేశం నిర్ణయాల పత్రంలో ఆమోదించిన ఐదు కీలక, కార్యాచరణ ఆధారిత నిర్ణయాలపై జీ20 వాణిజ్యం, పెట్టుబడి మంత్రివర్గ సమావేశం ఏకాభిప్రాయానికి వచ్చింది.

మొదటిది, వాణిజ్య పత్రాల డిజిటలీకరణపై ఉన్నత స్థాయి ప్రమాణాలను స్వీకరించడం. ఇందులో, దేశాల మధ్య కాగితం రహిత వాణిజ్యాన్ని సమర్థవంతంగా మారడంలో వివిధ కోణాలను సమగ్రపరిచే 10 సూత్రాలను జీ20 మంత్రులు వివరించారు. ఎలక్ట్రానిక్ వాణిజ్య సంబంధిత సమాచారం, పత్రాల మార్పిడికి సంబంధించిన చర్యలను అమలు చేయడంలో ఈ సూత్రాలు దేశాలకు మార్గదర్శకత్వం వహిస్తాయి. దీంతోపాటు, దేశాల మధ్య సురక్షిత పరస్పర సహకారం, పారదర్శకమైన కాగిత రహిత వాణిజ్యం నిర్వహణ వాతావరణం కల్పించాల్సిన అవసరాన్ని స్పష్టం చేస్తాయి. అటువంటి మార్పు అన్ని పరిమాణాల వ్యాపారాలకు అనుగుణంగా ఉండేలా చూడడానికి సూత్రాల్లో ప్రాధాన్యత ఇచ్చారు.

ఎంఎస్ఎంఈలకు సమాచార లభ్యతను మెరుగుపరచేందుకు 'జైపూర్ కాల్ ఫర్ యాక్షన్'ను కూడా జీ20 మంత్రులు ఆమోదించారు. ఎంఎస్ఎంఈలు ఎదుర్కొంటున్న సమాచార సంబంధిత సమస్యలను పరిష్కరించేలా ఐటీసీకి చెందిన ప్రపంచ వాణిజ్య సహాయ కేంద్రాన్ని ఆధునీకరించడం కోసం, యూఎన్‌సీటీఏడీ ఒ డబ్ల్యూటీఒతో సంప్రదింపుల ద్వారా ఒక వివరణాత్మక కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని ఇంటర్నేషనల్ ట్రేడ్ సెంటర్‌ను (ఐటీసీ) మంత్రులు కోరారు.

జీవీసీల కోసం 'జీ20 జనరిక్ మ్యాపింగ్ ఫ్రేమ్‌వర్క్'ను కూడా జీ20 మంత్రివర్గం ఆమోదించింది. ఇందులో కీలక సమాచారం, విశ్లేషణ, జీవీసీ సమాచార ప్రాతినిధ్యం ఉంటుంది. రంగాలు, ఉత్పత్తుల స్థాయిల్లో జీవీసీల స్థితిస్థాపకతను మదింపు చేసేందుకు సాయపడే కీలక పరిమాణాలను గుర్తించాలని కూడా ఫ్రేమ్‌వర్క్ సూచించింది.

వృత్తిపరమైన సేవల కోసం 'మ్యూచువల్ రికగ్నిషన్ అగ్రిమెంట్స్'లపై (ఎంఆర్ఏ) ఉత్తమ విధానాలను స్వచ్ఛందంగా పంచుకోవడాన్ని కూడా జీ20 మంత్రులు స్వాగతించారు. ఉత్తమ విధానాల కలయిక ఎంఆర్ఏ విజయాలను ప్రోత్సహిస్తుంది. ఇది మన వైద్యులు, నర్సులు, న్యాయవాదులు, ఇంజినీర్లు సహా వివిధ రంగాల నిపుణుల సాంకేతిక అర్హతలను ఇతర దేశాలు కూడా గుర్తించేలా చేస్తుంది. ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక సేవలను అందించడంలో ఇది మన వృత్తి నిపుణులకు సాయం చేస్తుంది.

నియంత్రణ పరమైన వైరుధ్యాలు, అనుబంధ వాణిజ్య వ్యయాలను తగ్గించడానికి, అనవసరమైన వాణిజ్య ఘర్షణలను నివారించడానికి, వాణిజ్యం ఒ పెట్టుబడి సంబంధిత చర్యలను పర్యవేక్షించడానికి, ఇప్పటికే ఉన్న సమస్యలను పరిష్కరించుకోవడానికి పరస్పరం సమావేశం కావలసిన అవసరాన్ని, ప్రాముఖ్యతను జీ20 మంత్రులు గుర్తించారు. 2023లో 'జీ20 స్టాండర్డ్స్ డైలాగ్' నిర్వహించాలన్న భారతదేశ సూచనను జీ20 మంత్రులు స్వాగతించారు. దీనివల్ల జీ20 సభ్య దేశాలు, విధాన నిర్ణేతలు, నియంత్రణ సంస్థలు, ఇతర వాటాదార్లు ఒకచోట చేరి ఉత్తమ నియంత్రణ విధానాలు, ప్రమాణాలు వంటి ఉమ్మడి అంశాలపై చర్చిస్తారు.

మొత్తం ఐదు నిర్ణయాలకు జీ20 మంత్రుల నుండి విస్తృత మద్దతు లభించింది.

2024 ప్రారంభంలో జరిగే డబ్ల్యూటీవో 13వ మంత్రివర్గ సమావేశంలో (ఎంసీ13) జరిగే ఒప్పందాల్లో ఎక్కువ భాగం వాస్తవ రూపం దాల్చేలా చూడాలని వరల్డ్ ట్రేడ్ సెంటర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ న్గోజీ ఒకోంజో-ఇవాలా జీ20 మంత్రులకు సూచించారు. డబ్ల్యూటీవోతో బహుపాక్షిక వాణిజ్య వ్యవస్థ పాత్రను జీ20 మంత్రులు స్పష్టం చేశారు. డబ్ల్యూటీవో నియమాలను రూపొందించే విభాగాన్ని బలోపేతం చేయడంలో తమ నిబద్ధతను చాటారు. ముఖ్యంగా, డబ్ల్యూటీవో 13వ మంత్రివర్గ సమావేశంలో డబ్ల్యూటీవో సంస్కరణలు సహా సానుకూల ఫలితాలు వచ్చేలా పని చేయడాన్ని కొనసాగించడానికి జీ20 మంత్రులు అంగీకరించారు.

# రక్షణ రంగంలో స్వావలంబనకు అతి పెద్ద ప్రోత్సాహం

న్యూఢిల్లీ, ఆగష్టు 26:భారత రక్షణ మంత్రిత్వ శాఖ, ఈ రోజు, భారతీయ నౌకాదళం కోసం ఐదు ఫ్లీట్ సపోర్ట్ షిప్'లను (ఎఫ్ఎస్ఎస్) కొనుగోలు చేసేందుకు విశాఖపట్నంలోని 'హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్'తో (హెచ్ఎస్ఎల్) ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం విలువ రూ.19,000 కోట్లు. ఈ నౌకలను స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించి, నిర్మిస్తారు కాబట్టి, రక్షణ రంగ తయారీలో స్వావలంబన లక్ష్యాన్ని సాధించడంలో ఇది అతి పెద్ద ప్రోత్సాహంగా నిలుస్తుంది. ఈ నెల 16న జరిగిన సమావేశంలో, నౌకల కొనుగోలుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

సముద్రంలో ఉన్న నౌకలకు ఇంధనం, నీరు, మందుగుండు సామగ్రి, సరుకులను అందించడానికి ఎఫ్ఎస్ఎస్‌ను ఉపయోగిస్తారు. భారత నౌకాదళ నౌకలు తిరిగి నౌకాశ్రయానికి రాకుండా సుదీర్ఘకాలం సముద్రంలోనే పని చేయడానికి ఇది వీలు కల్పిస్తుంది. ఈ నౌకలు నౌకాదళం వ్యూహాత్మక పరిధిని మెరుగుపరుస్తాయి, జల సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుతాయి. ప్రజలను తరలించడానికి, 'మానవ సాయం ఒ విపత్తు నిర్వహణ' (హార్డ్) కార్యకలాపాలకు కూడా నౌకలను మోహరించవచ్చు.

భారతీయ షిప్‌యార్డ్ నిర్మించే ఈ 44,000 టన్నుల ఫ్లీట్ సపోర్ట్ షిప్'లు భారతదేశంలో నిర్మించే మొట్టమొదటి నౌకలుగా నిలుస్తాయి. ఈ ప్రాజెక్టు వల్ల ఎనిమిదేళ్లలో దాదాపు 168.8 లక్షల పని దినాల ఉపాధిని సృష్టిస్తుంది. ఈ నౌకల నిర్మాణం భారతీయ నౌకా నిర్మాణ పరిశ్రమకు కొత్త ఉత్సాహాన్ని అందిస్తుంది, ఎంఎస్ఎంఈలు సహా అనుబంధ పరిశ్రమల భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తుంది. నౌకల నిర్మాణంలో ఉపయోగించే ఎక్కువ పరికరాలు, వ్యవస్థలను స్వదేశీ సంస్థల నుంచి తీసుకుంటారు. కాబట్టి, ఈ నౌకలు 'భారత్‌లో తయారీ' ప్రచారానికి అనుగుణంగా, 'ఆత్మనిర్భర్ భారత్'ను సగర్వంగా చాటుతాయి.

# సుస్థిరత్వం, వాతావరణ స్థితిస్థాపకత నిర్మిత పర్యావరణ జీవిత చక్రం అంతటా పాదుకోవాలి: శ్రీ హర్దీప్ ఎస్.పూరి



న్యూఢిల్లీ, ఆగష్టు 26:నిర్మిత పర్యావరణం జీవిత చక్రం అంతటా సుస్థిరత, వాతావరణ స్థితిస్థాపకతను పొందుపరిచే కోణం నుంచి పట్టణ ప్రణాళికను చూడాల్సిన అవసరం ఉందని గృహనిర్మాణం, పట్టణ వ్యవహారాలు, పెట్రోలియం, సహజ వాయువు శాఖల మంత్రి శ్రీ హర్దీప్ ఎస్ పూరి స్పష్టం చేశారు. నిర్మాణ రంగంలో నూతన, అభివృద్ధి చెందుతున్న బిల్డింగ్ మెటీరియల్స్, టెక్నాలజీల స్వీకరణపై సదస్సును ప్రారంభించిన మంత్రి, మోదీ ప్రభుత్వం పట్టణీకరణను బహుముఖ వృద్ధికి ఒక అవకాశంగా చూసిందని, అందువల్ల భారతదేశ ప్రణాళికాబద్ధమైన పట్టణీకరణ అత్యంత సమగ్రమైన కార్యక్రమాలలో ఒకటిగా ఉందని అన్నారు. ఈ నేపథ్యంలో, మంత్రిత్వ శాఖ ప్రతిష్టాత్మక గృహనిర్మాణ పథకం- ప్రధాన మంత్రి ఆవాస్ యోజన-అర్బన్ (పిఎంఎవై-యు) భారతదేశ పట్టణ పేదలకు తక్కువ వ్యయం తో సరసమైన గృహాలను అందించే సమస్యను పరిష్కరించడంతో పాటు స్థిరమైన, హరిత మౌలిక సదుపాయాలను సృష్టిస్తోందని చెప్పారు. పిఎమ్ ఎవై-యులో గ్రీన్ కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీల వాడకాన్ని ప్రముఖంగా ప్రస్తావిస్తూ, ఫ్లయ్ యాష్ బ్రిక్స్/బ్లాక్ లు, ఎఎసి బ్లాక్ లు వంటి సుస్థిర నిర్మాణ సామగ్రిని ఉపయోగించి ఈ మిషన్ కింద సుమారు 43.3 లక్షల గృహాలను నిర్మిస్తున్నట్లు శ్రీ పురి తెలియజేశారు. 2024 డిసెంబర్ చివరి నాటికి 9 మిలియన్ టన్నుల కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలను తగ్గించడానికి ఈ గృహాలు దోహదం చేస్తాయి.

గృహ నిర్మాణ రంగంలో సమూల మార్పు తీసుకురావడానికి, గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఒహెచ్ యుఎ) గ్లోబల్ హౌసింగ్ టెక్నాలజీ ఛాలెంజ్ (జిహెచ్‌టిసి) కింద ప్రపంచవ్యాప్తంగా 54 వినూత్న నిర్మాణ సాంకేతికతలను షార్ట్ లిస్ట్ చేసింది. చెన్నై, రాజ్ కోట్, ఇండోర్, లక్నో, రాంచీ, అగర్తలా నగరాల్లో ప్రస్తుతం అమలవుతున్న ఆరు లైట్ హౌస్ ప్రాజెక్టుల కింద 6,368 ఇళ్లను నిర్మిస్తున్నారు. ఈ వినూత్న నిర్మాణ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం వల్ల కలిగే బహుళ ప్రయోజనాలను మంత్రి వివరించారు. వీటిలో నిర్మాణ వ్యయం, సమయం, ఉపయోగించిన సిమెంట్, ఉత్పత్తి అయ్యే వ్యర్థాలతో పాటు పెరిగిన థర్మల్ సౌకర్యం తక్కువ జీవిత చక్ర ఖర్చులు ఉన్నాయి.

సరికొత్త, సృజనాత్మక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సమాజంలోని అన్ని వర్గాలకు నాణ్యమైన గృహాలను అందించాల్సిన అవసరాన్ని గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి శ్రీ కౌశల్ కిశోర్ పునరుద్ఘాటించారు, ఎందుకంటే ఇది నూతన, స్వావలంబన భారతదేశంలో మెరుగైన జీవన నాణ్యతకు దోహదం చేస్తుంది. పెరుగుతున్న ఇళ్ల డిమాండ్ ను పరిష్కరించడానికి దేశానికి సహాయపడే ఆధునిక, హరిత నిర్మాణ సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రోత్సహించడం ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడం ప్రాముఖ్యతను గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ మనోజ్ జోషి నొక్కి చెప్పారు.

ఈ నిర్మాణ సామగ్రి దేశంలోని విభిన్న భౌగోళిక-వాతావరణ, ప్రమాద పరిస్థితులకు అనుగుణంగా వేగవంతమైన, మెరుగైన నాణ్యత కలిగిన గృహ నిర్మాణానికి వీలు కల్పిస్తుంది. సీపీడబ్ల్యూడీ, ఎన్ బీసీసీ సహకారంతో క్రెడాయ్ నిర్వహించిన ఈ సదస్సు నిర్మాణ, రియల్ ఎస్టేట్ రంగాల్లోని ప్రతిభావంతులను ఒకే వేదిక పైకి తెచ్చింది.

# పశ్చిమ బంగాల్‌లో ఆరోగ్య సేవలను సమీక్షించిన కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి డా.మన్‌సుఖ్ మాండవీయ



న్యూఢిల్లీ, ఆగష్టు 26:"పశ్చిమ బంగాల్ పౌరులందరికీ నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ సేవలను అందించడానికి ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేతృత్వంలోని భారత ప్రభుత్వం కట్టుబడి ఉంది. పశ్చిమ బంగాల్ ప్రజల ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వం క్షేత్ర స్థాయిలో ఆయుష్మాన్ భారత్‌ను అమలు చేయాలి. రాష్ట్రంలో నాణ్యమైన ఆరోగ్య సేవలు అందుబాటులో ఉండేలా అన్ని చర్యలు తీసుకుంటున్నాం" అని కేంద్ర ఆరోగ్య ఒ కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డా.మన్‌సుఖ్ మాండవీయ చెప్పారు. పశ్చిమ బంగాల్‌లో ఆయన పర్యటించారు. రాష్ట్రంలో ఆరోగ్య సేవలను అందించే వివిధ కార్యక్రమాలపై కేంద్ర మంత్రి ఈ రోజు సమీక్ష నిర్వహించారు.

తన పర్యటనలో భాగంగా, ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య ఒ వెల్‌నెస్ కేంద్రాలు, జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం అమలు తీరును కేంద్ర మంత్రి సమీక్షించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమం (ఎన్‌హెచ్ఎం), ప్రధాన మంత్రి ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మౌలిక సదుపాయల కార్యక్రమం (పీఎం అభిమ్), టెలిమెడిసిన్ సేవలు, వైద్య విద్య, సికిల్ సెల్ అనీమియా నిర్మూలన కార్యక్రమం కింద విడుదల చేసిన నిధుల వినియోగం గురించి వాకబు చేశారు.

"ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య ఒ వెల్‌నెస్ కేంద్రాలు ప్రజల ఇళ్లకు సమీపంలోనే ఉండి, సమగ్ర ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ సేవలను అందించే గొప్ప చొరవ"గా డా.మాండవీయ చెప్పారు. జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం, జాతీయ ఆరోగ్య కార్యక్రమం కింద విడుదల చేసిన నిధుల స్థితిగతులపైనా కేంద్ర ఆరోగ్య మంత్రి సమీక్షించారు. "2025 నాటికి క్షయ వ్యాధిని నిర్మూలించడానికి భారత ప్రభుత్వం కట్టుబడి ఉంది. జాతీయ ఆరోగ్య కార్యక్రమం కింద విడుదల చేసిన నిధులను సమర్థవంతంగా ఉపయోగించుకునేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం'' అని చెప్పారు.

15వ ఆర్థిక సంఘం సిఫార్సుల ప్రకారం, పశ్చిమ బంగాల్‌లో రూ.180.12 కోట్లతో 223 బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్లు, రూ.290 కోట్లతో 719 ఉప కేంద్రాలకు ఆమోదం లభించిందని డా.మాండవీయ వెల్లడించారు. పశ్చిమ బంగాల్‌లో 16,82,87,430 మంది సందర్శనలతో 10,358 ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య ఒ వెల్‌నెస్ కేంద్రాలు పని చేస్తున్నాయని, 2,08,42,397 టెలీ సంప్రదింపులు నిర్వహించామని చెప్పారు.

ప్రధాన మంత్రి ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మౌలిక సదుపాయల కార్యక్రమం, టెలీమెడిసిన్ సేవల గురించి మాట్లాడిన కేంద్ర మంత్రి, "పశ్చిమ బంగాల్ ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ సేవలను అందించడానికి పీఎం అభిమ్ ఒక గొప్ప కార్యక్రమం. రాష్ట్రంలోని పౌరులందరికీ టెలీమెడిసిన్ సేవలు అందుబాటులో ఉండేలా కృషి చేస్తున్నాం" అన్నారు. ఈ రంగంలో, రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని ఈ కింది విధంగా వివరించారు:వైద్య విద్య, సికిల్ సెల్ ఎనీమియా నిర్మూలన కార్యక్రమాన్ని కూడా కేంద్ర మంత్రి సమీక్షించారు. "పశ్చిమ బంగాల్ ప్రజలకు నాణ్యమైన వైద్య విద్యను అందించడానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది. సికిల్ సెల్ అనీమియా నిర్మూలన కార్యక్రమం విజయవంతం కావడానికి అవసరమైన అన్ని చర్యలను కూడా తీసుకుంటున్నాం" అని చెప్పారు.

# రజకులకు ఎస్సీ రిజర్వేషన్ కల్పించే వరకు పోరాటం ఆగదు.. మల్లేష్ కుమార్

నిజామాబాద్, ఆగష్టు 26:రజకులకు ఎస్సీ రిజర్వేషన్ కల్పించే వరకు పోరాటం ఆగదని, రజకులు అందరూ ఐక్యంగా ఉండి తమ హక్కుల సాధనకై ముందుకెళ్లాలని నేషనల్ కో ఆర్డినేటర్ కె.మల్లేష్ కుమార్ అన్నారు. ఎస్, సి రిజర్వేషన్ ఇచ్చిన పార్టీకే తమ పూర్తి మద్దతు ఉంటుందన్నారు. శనివారం నిజామాబాద్ నగరంలోని ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన రజక సంఘం జిల్లా సమావేశానికి నేషనల్ కో ఆర్డినేటర్ కె.మల్లేష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

అనంతరం రజక సంఘం టౌన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రజక సంఘం టౌన్ అధ్యక్షుడిగా కనక రాజు, కార్యదర్శిగా శ్యామ్ సింగ్, కోశాధికారి ప్రభాకర్, ఉపాధ్యక్షులుగా సత్యనారాయణ, చిన్న సాయిలు, శివ కుమార్, రూపేష్, అశోక్, సహాయ



కార్యదర్శులుగా విజయ్, శంకర్, గంగరాజు, శంకర్ సింగ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన కార్యవర్గానికి నియామక పత్రాలను అందజేశారు.

అనంతరం నేషనల్ కో ఆర్డినేటర్ కె.మల్లేష్ కుమార్ మాట్లాడుతూ.. 17 రాష్ట్రాల్లో రజకులకు ఎస్ సి రిజర్వేషన్ ఇచ్చారని, కేవలం 11రాష్ట్రాల్లో బీసీలుగా చేర్చారన్నారు. తెలంగాణలో నైజాం పాలన ఉండడంతో ఎస్ సి లుగా చేర్చలేక పోయారన్నారు. మిగితా కులాలకు తాము వ్యతిరేకం కాదని, వారి రిజర్వేషన్ 15 శాతం అట్లాగే ఉంచి తమకు అదనంగా రెండు శాతం కలిపి 17శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. అంటరాని బట్టలు ఉతుకుతున్న తమ కులస్తులకు ఎస్ సి రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఎస్ సి రిజర్వేషన్ ఇచ్చిన పార్టీకే తాము మద్దతు ఇస్తామన్నారు. ఎలక్షన్ కోడ్ రాక ముందు కేంద్రానికి సిఫారస్ చేయాలని కోరారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రజకులకు ఎస్సీ రిజర్వేషన్ కల్పించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు వర్నపల్లి నర్సింహులు రజక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నాని, రాష్ట్ర కార్యదర్శి భూమేష్, యూట్యూబ్ ప్రధాన కార్యదర్శి యూత్ ప్రధాన కార్యదర్శి సాయి, యూత్ ఉపాధ్యక్షులు రవీందర్, రాష్ట్ర కమిటీ సభ్యులు అంజయ్య, రాష్ట్ర సాంస్కృతిక కన్వీనర్ పోశెట్టి, రజక కులస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# వారం తర్వాతే రాజకీయ నిర్ణయం-ఎమ్మెల్యే మైనంపల్లి



హైదరాబాద్, ఆగష్టు 26:మెదక్ ప్రజలు తనకు రాజకీయ ప్రాణభిక్ష పెట్టారని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. మేడ్చల్ జిల్లా దూలపల్లిలోని ఆయన నివాసానికి ఇవాళ పెద్దఎత్తున భారాస కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు. ఇటీవల తిరుమలలో మంత్రి హరీశ్ రావుపై మైనంపల్లి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఆయన భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో తన కుమారుడు రోహిత్‌కు మెదక్ అసెంబ్లీ టికెట్‌ను నిరాకరించడంతో అనుసరించాల్సిన వ్యూహాలపై అనుచరులతో మైనంపల్లి చర్చించారు.

అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, బీఆర్ఎస్ పెద్ద నేత తనతోమాట్లాడారని, మీడియాకు ఎక్కవద్దని సూచించారని వెల్లడించారు.. అలాగే మల్కాజీగిరిలోవారం రోజుల పర్యటిస్తానని,అ తర్వాతే తన రాజకీయ నిర్ణయాన్నిప్రకటిస్తానని చెప్పారు.

" జీవితంలో స్థిరపడటం అంటూ ఉండదు. చనిపోయిన తర్వాతే జీవితంలో స్థిరపడినట్లు. టిడిపి మెదక్ జిల్లా అధ్యక్షుడిగా 8 ఏళ్లు పనిచేశా. ఆ తర్వాత భారాసలో ఉన్నా. ఏ పార్టీలో ఉన్నా.. వెన్నుపోటు పొడిచే అలవాటు నాకు లేదు. ప్రాణం పోయే వరకు మాటపైనే ఉంటా. మెదక్ ప్రజలు నాకు రాజకీయ ప్రాణభిక్ష పెట్టారు. నేనూ ఎప్పుడూ కాంగ్రెస్, భారాస, భాజపాను తిట్టలేదు. అంతా కలిస్తేనే తెలంగాణ సాకారమైంది. భారాసను ఏమీ అనలేదు.. పార్టీ కూడా నన్ను ఏమీ అనలేదు. మల్కాజిగిరిలో వారం రోజులపాటు అనుచరులందరినీ కలుస్తాను. కార్యకర్తలతో మాట్లాడిన తర్వాత నిర్ణయం తీసుకుంటాను. వారం తర్వాత మీడియాను పిలిచి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తా. అయితే నా కొడుకుకు 25 ఏళ్లు.. ఇంకా భవిష్యత్ ఉంది. భారతలో పోటీతత్వం ఉంది.. నా కొడుకు నా కంటే ఎక్కువ సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. మెదక్‌లో నా కుమారుడు తిరిగి ప్రజాభిప్రాయం కోరతాడు" అని మైనంపల్లి వెల్లడించారు.




# పోలింగ్ బూత్‌లను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

నిజామాబాద్, ఆగష్టు 26: ఓటరు జాబితాలో పేర్ల నమోదు, మార్పులు-చేర్పులకు అవకాశం కల్పిస్తూ పోలింగ్ బూత్ ల పరిధిలో ఈనెల 26, 27 తేదీల్లో ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు శనివారం పలు పోలింగ్ బూత్ లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మోస్రా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, చందూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో గల పోలింగ్ కేంద్రాలను సందర్శించి ప్రత్యేక శిబిరాల నిర్వహణ తీరుతెన్నులు పరిశీలించారు. బీ.ఎల్.ఓ లు, ఎన్నికల అధికారులు అందుబాటులో ఉన్నారా అని ఆరా తీశారు.

వారి వద్ద గల రిజిస్టర్లను తనిఖీ చేసి, ఓటర్ల నమోదు, మార్పులు-చేర్పుల వివరాలను పరిశీలించారు. ప్రత్యేక శిబిరాల గురించి విస్తృత ప్రచారం నిర్వహించాలని, ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఇంటింటికి తిరిగి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు తప్పనిసరిగా ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకునేలా చొరవ చూపాలన్నారు. మృతిచెందిన ఓటర్లకు సంబంధించి వారి కుటుంబ సభ్యులను సంప్రదించి మరణ ధ్రువీకరణ పత్రం సేకరించి క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరమే జాబితా నుండి పేరు తొలగించాలని సూచించారు. కలెక్టర్ వెంట అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఉన్నారు.

# రాజస్థాన్ రాష్ట్రవ్యాప్తంగా 33 ఖేలో ఇండియా కేంద్రాలు ప్రారంభించిన క్రీడా మంత్రి శ్రీ అనురాగ్ సింగ్ ఠాకూర్

న్యూఢిల్లీ, ఆగష్టు 25:జైపూర్ లోని సవాయ్ మాన్‌సింగ్ స్టేడియంలో బుధవారం ఉదయం కేంద్ర యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రి శ్రీ అనురాగ్ సింగ్ ఠాకూర్ రాజస్థాన్ రాష్ట్రంలో 33 ఖేలో ఇండియా కేంద్రాలను ప్రారంభించారు. రాజస్థాన్‌లో అదనంగా 18 ఖేలో ఇండియా కేంద్రాలతో పాటు నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ను, దానికి అంకితమైన ప్రత్యేక క్రీడా విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేస్తామని, తద్వారా రాష్ట్రంలో మొత్తం ఖేలో ఇండియా కేంద్రాల సంఖ్య 51కి పెరుగుతుందని కేంద్ర మంత్రి ప్రకటించారు.

ఖేలో ఇండియా కేంద్రాల మధ్య ఆటల పోటీలు నిర్వహిస్తామని, శిక్షకులకు శిక్షణ (కోచింగ్ ది కోచెస్) కార్యక్రమాన్ని ఖేలో ఇండియా కేంద్రాలకు కూడా విస్తరిస్తామని ప్రకటించారు. జాతీయ ఒ అంతరాతీయ కోచ్‌ల పర్యవేక్షణలో కోచ్ లకు అలాగే ఖేలో ఇండియా కేంద్రాల కోచ్ లకు (పెద్ద కోచ్ లకు జతచేసి) శిక్షణ ఇవ్వడం జరుగుతుం దనిఇంకా ఈ కార్యక్రమంలో రాజస్థాన్ యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రి శ్రీ అశోక్ చందనా, అలాగే రాష్ట్రానికి చెందిన ఇతర ప్రముఖులు, యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వ శాఖ, భారత క్రీడా సంస్థ (సాంఎ) అధికారులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో శ్రీ అనురాగ్ సింగ్ ఠాకూర్ ప్రసంగిస్తూ, "అన్ని రాష్ట్రాలు క్రీడల్లో ఎదగాలన్నది తమ అభిమతమని, క్రీడలపట్ల దృష్టిని కేంద్రీకరించి కేంద్ర ప్రభుత్వంతో రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పని చేస్తే భారత్ కు మరిన్ని పతకాలు వస్తాయి" అని మంత్రి అన్నారు. "ప్రభుత్వం ప్రారంభించిన ఖేలో ఇండియా పథకం, అదే విధంగా ఒలింపిక్ పోడియంపై గురి పథకం విజయవంతం కావడం వల్ల గత కొన్ని సంవత్సరాలుగా అంతర్జాతీయంగా మన క్రీడాకారులు అత్యధిక సంఖ్యలో పతకాలు సాధించారు. అది ఒలిం పిక్స్ అయినా లేదా పారాలింపిక్స్ అయినా లేదా కామన్వెల్త్ క్రీడలైనా లేదా థామస్ కప్ విజయం వంటి చారిత్రాత్మక సంఘటన అయినా విజ యాలు వరించాయి. అంతిమ్ పం ఘల్ కూడా రెండు సార్లు ప్రపంచ అండర్ 20 ఛాంపియన్ గా నిలిచి చరిత్ర సృష్టించాడు. అదే విధంగా చదరంగంలో ప్రజ్ఞానానంద ఈఎఆఇ ప్రపంచకప్ ఫైనల్‌కు చేరుకున్నాడు. భారతీయ క్రీడాకారులు నమ్మలేని విజయాలను సాధిస్తున్నారు. ఇది నమ్మశక్యం కాని దశ. ఎందుకంటే గత 60 ఏళ్లలో ప్రపంచ యూనివర్సిటీ గేమ్స్‌లో 18 పతకాలు మాత్రమే వచ్చాయి. ఈ ఒక్క ఏడాది టోర్నీలో 26 పతకాలు సాధించడం అపూర్వం" అని మంత్రి వివరించారు. ఖేలో ఇండియా ప్రాముఖ్యత గురించి ప్రస్తావిస్తూ మంత్రి "ఈ విజయాలన్నింటిలో ఖేలో ఇండియా ప్రాతినిధ్యం పెద్దది. ప్రతి సంవత్సరం, చాలా మంది అథ్లెట్లు యూత్, యూనివర్సిటీ మరియు వింటర్ గేమ్స్‌లో పాల్గొంటారు. ఈ పోటీలలో పాల్గొని సాధించిన అనుభవం వారిని పెద్ద పోటీలకు తీసుకువెళుతోంది. రాజస్థాన్ నుండి ఎక్కువ మంది అథ్లెట్లు ఈ ఖేలో ఇండియా కేంద్రాలలో శిక్షణ పొంది మెరుగైన క్రీడాకారులుగా తయారుకాగలరని నేను ఆశిస్తున్నాను. ప్రస్తుత, గత మరియు భవిష్యత్తు క్రీడాకారులు కూడా వీటి ద్వారా పోటీలకు సిద్ధమవుతున్నారు" అని అన్నారు.

దేశవ్యాప్తంగా ప్రస్తుతం 17,000 మంది క్రీడాకారులు ఖేలో ఇండియా కేంద్రాలలో శిక్షణ పొందుతున్నారు. దేశవ్యాప్తంగా ఈ కేంద్రాలలో శిక్షణ ఇవ్వడానికి 699 మంది గత ఛాంపియన్లను నియమించడం జరిగింది. దేశవ్యాప్తంగా మొత్తం 960 ఖేలో ఇండియా కేంద్రాలను ప్రకటించడం జరిగింది. వాటిలో 715 ఐఎఅలు పనిచేస్తున్నాయి. రాజస్థాన్ లో ప్రకటిత ఐఎఅల సంఖ్యా 33. వాటిలో 32 పనిచేస్తున్నాయి. ఈ ఐఎఅలు సైక్లింగ్, బాస్కెట్‌బాల్, వుషు, హాకీ తదితర క్రీడా విభాగాలలో శిక్షణ ఇచ్చే కేంద్రాలు.

బ్లాక్, జిల్లా స్థాయి పాఠశాలలు, సంస్థలు ఇతర అర్హత ఉన్న ఏజెన్సీలలో అందుబాటులో ఉన్న క్రీడా మౌలిక సదుపాయాల వినియోగాన్ని పెంపొందించడానికి ఏర్పాటు చేసే చిన్న ఖేలో ఇండియా కేంద్రాలు అట్టడుగు స్థాయిలో క్రీడా పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడంలో సహాయపడతాయి.

